



ఖర్చులకూ రాని టమోటా

● ధరలు భారీగా పతనం

టమోటా కోత కూలి, రవాణా ఖర్చులకూ రానంతగా ధరలు పతనమయ్యాయి. ఆగస్టు రెండో వారం నుంచి మొదలైన ధరల పతనం.. శనివారానికి మరింతగా దిగజారింది. పుంగనూరు, పలమనేరు మార్కెట్లలో నాణ్యత కలిగిన 15 కిలోల టమోటా బాక్సు ధర రూ.175కు చేరుకుంది. మిగిలిన రెండో రకం రూ.100 లోపు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే జూలైలో రూ.400, ఆగస్టు మొదటి వారం 15 కిలోల బాక్సు రూ. 300 వరకు ధరలు పలికాయి. అక్కడ్నుంచి క్రమేణా తగ్గుముఖం పడుతూ.. ప్రస్తుతం కోత కూలి, రవాణా ఖర్చులు కూడా రానంతగా ధరలు పతనమయ్యాయి. ఎకరా సాగుకు లక్షలు వ్యయం చేస్తున్న రైతులు కోతలు చేయడానికే ఇబ్బందులు పడుతున్నారు. బాక్సు ధర రూ.400 వరకు పలికితే పెట్టుబడి వస్తుందని రైతులు అంటున్నారు. మార్కెట్‌కు ఇతర ప్రాంత వ్యాపారులు రాకపోవడంతో మండీ యజమానులే తక్కువ ధరకు టమోటాలను కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

- సోమల

ఇసుక అక్రమ నిల్వల సీజ్

నగరి పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపలను అధికారులు సీజ్ చేశారు. సిబ్బందితో కలిసి సీఐ మహేశ్వర్ దాడులు జరిపారు. కరకంతాపురం సమీపంలో మూడు చోట్ల.. కీళపట్టు పరిసర ప్రాంతాల్లో ఒకచోట ఇసుక డంపింగ్‌లను శుక్రవారం రాత్రి 12 గంటలపైన దాడులు చేసి గుర్తించారు. శనివారం ఉదయం తహసీల్దారు రవికుమార్‌కు సమాచారం అందించి రెవెన్యూ సిబ్బందిని ఇసుక డంపింగ్ ప్రాంతాలకు తీసుకెళ్లి అప్పగించారు. కరకంతాపురం సమీపాన గల ఓ క్రషర్ సమీపంలో మూడు చోట్ల 40 ట్రక్కుల ఇసుక, వైట్‌హౌస్ వద్ద 8 ట్రక్కుల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దారు రవికుమార్, సీఐ మహేశ్వర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హౌసింగ్ డీఈఈకి ఇసుకను స్వాధీనం చేయనున్నారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేసినా.. తమిళనాడుకు తరలించినా కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం అర్ధరాత్రిపైన ఇసుక డంపింగులపై దాడులు చేసినట్లు సీఐ తెలిపారు.

- నగరి





జడ్పీ సీఈవో గ్లోరియా

జడ్పీలో బదిలీలకు 575 మంది దరఖాస్తు

● ముగిసిన స్వీకరణ గడువు ● 31నాటికి ప్రక్రియ పూర్తిచేస్తామన్న సీఈవో
● కుప్పం నియోజకవర్గంలో ఎంపీడీవోల నియామకం పూర్తి

చిత్తూరు రూరల్, ఆగస్టు 24: జిల్లా పరిషత్తులో బదిలీల ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల స్వీకరణ గడువు శనివారం ముగిసింది. ఎంపీడీవోల నుంచి అటెండర్ వరకు.. వివిధ క్యాడర్లకు సంబంధించి 575 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఒకే చోట ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న వారు 297 మంది ఉన్నారు. వీరికి బదిలీలు అనివార్యం. ఐదేళ్లు పూర్తి కాని వారు కూడా వివిధ స్థానాలకు బదిలీ కావాలని ప్రజాప్రతినిధుల లెటర్లతో దరఖాస్తు చేసుకున్నారు.

ఒకరికి మాత్రమే ఐదేళ్లు పూర్తి

చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 65 మండలాలు ఉంటే అందులో 48 మండలాలకు రెగ్యులర్ ఎంపీడీవోలు ఉండగా మిగిలిన 17 చోట్ల ఈవోఆర్డీలు, ఏవోలు ఇన్‌చార్జులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ 48 మంది ఎంపీడీవోల్లో పుత్తూరు ఎంపీడీవో ఇందిరమ్మ ఒక్కరే ఒకే మండలంలో ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్నారు. దీంతో ఆమెకు బదిలీ అనివార్యమైంది. మిగిలిన వారు రెండు నుంచి నాలుగేళ్ల వరకు సర్వీసులు పూర్తి చేసుకున్నారు. వీరిని ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బదిలీ చేయనున్నారు. కాగా, తమకు అందిన బదిలీ దరఖాస్తులను 25 నుంచి పరిశీలించనున్నట్లు జడ్పీ సీఈవో గ్లోరియా తెలిపారు. పరిపాలన సౌలభ్యం, ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా బదిలీ ప్రక్రియను ఈనెల 31 నాటికి పూర్తి చేసి.. జాబితా ప్రకటిస్తామని చెప్పారు.

కుప్పం నియోజకవర్గంలో ఎంపీడీవోల నియామకం

సీఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పనిచేసేందుకు సమర్థులైన ఎంపీడీవోలను ఏరికోరి నియమించారు. ఇక్కడ ఎంపీడీవోల నియామక ప్రక్రియను పూర్తిచేసి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో కుప్పం మండలానికి సాయి లహరిని నియమించారు. ఈమె బీఎన్ కండ్రిగ నుంచి కుప్పానికి బదిలీపై వచ్చారు. వెదురుకుప్పం ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్‌ను శాంతిపురానికి.. ఏర్పేడు ఎంపీడీవో గిడ్డయ్యను రామకుప్పానికి బదిలీ చేశారు. ఇక, ఎన్నికల బదిలీలో భాగంగా గుడుపల్లె నుంచి ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవో తాజ్‌మజూరూర్‌ను.. తిరిగి ఇక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సొంత జిల్లాకు బదిలీ కోసం 13 మంది దరఖాస్తు

తమ సొంత జిల్లాల్లో పోస్టింగు కావాలని 13 మంది ఎంపీడీవోలు జడ్పీ సీఈవో గ్లోరియాకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 11 మంది కడప జిల్లా కాగా, ఇద్దరు అనంతపురం జిల్లాకు చెందిన వారు. ఇతర జిల్లాల్లో బదిలీలు పీఆర్ కమిషనర్ పరిధిలో ఉండడంతో వీరి దరఖాస్తులను కమిషనర్ పీఆర్‌కు పంపించినట్లు సీఈవో తెలిపారు.

టపాకాయల పేలుడు ఘటనలో

భార్యాభర్తల మృతి

● సీఎంసీలో చికిత్స పొందుతున్న మూడేళ్ల బాలుడు



సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న సీఐ ప్రసాద్

గంగవరం, ఆగస్టు 24: గంగవరం మండలం మారేడుపల్లెలో శుక్రవారం రాత్రి టపాకాయల పేలుళ్ల సంఘటనలో తీవ్రంగా గాయపడిన దంపతులు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఇంట్లో జరిగిన ఈ పేలుడులో భవనం నేలమట్టం కాగా, అదే సమయంలో ఇంట్లో ఉన్న ఖాదర్‌బాషా, ఆయన భార్య జరీనా, మూడేళ్ల కుమారుడు హమీద్ బాషా తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. గాయపడిన భార్యాభర్తలను తిరుపతికి.. మూడేళ్ల బాలుడిని మాత్రం వేలూరులోని సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. తిరుపతిలో చికిత్స పొందుతున్న ఖాదర్‌బాషా, జరీనా శనివారం ఉదయం కన్నుమూశారు. కాగా, టపాకాయల పేలుడు సంఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి, గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్, క్లూస్‌టీమ్ తదితర బృందాలు శనివారం పరిశీలించాయి. పేలుడు ప్రదేశంతో పాటు చుట్టుపక్కల లభించిన ఆధారాలను సేకరించారు. పేలుడు ధాటికి నేల కూలిన ఇంట్లోని సామగ్రి, టపాకాయలకు ఉపయోగించే ముడి పదార్థాలను పరిశీలించి ల్యాబ్‌కు పంపడానికి నమూనాలను సేకరించారు. ఈ పేలుడు టపాకాయల వల్ల జరిగిందా లేదా నల్లమందు నిల్వల వల్లనా అనేది ల్యాబ్ నుంచి వచ్చే నివేదికల ద్వారా తేలనుందని అధికారులు తెలిపారు. ఎవరైనా టపాకాయలు, నల్లమందు సామగ్రిని అక్రమంగా నిల్వ చేసినట్లయితే ఆ సమాచారం తమకు అందించి సహకరించాలని జిల్లా అగ్నిమాపక అధికారి పెద్దిరెడ్డి కోరారు.

వైసీపీ నేత భవనంలో రూ.9 లక్షల టపాకాయలు సీజ్



గంగవరం, ఆగస్టు 24: వైసీపీ నేత భవనంలో భారీగా నిల్వ ఉంచిన టపాకాయలను శనివారం పోలీసులు సీజ్ చేశారు.వీటి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుందని అంచనా. వీటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మారేడుపల్లెలో టపాకాయల పేలుడు ఘటన నేపథ్యంలో సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో అక్రమ నిల్వలపై నిఘా ముమ్మరం చేశారు. వీటిపై దాడులకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం వచ్చిన పక్కా సమాచారంతో గంగవరం పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోని వైసీపీ నేత వీరభద్రకు చెందిన భవనం వద్దకు సీఐ ప్రసాద్, సిబ్బంది చేరుకున్నారు. టపాకాయలు ఉన్నట్లు అనుమానించిన గదికి తాళం వేసి ఉండటంతో ఆ యజమానికి పలుమార్లు ఫోను చేశారు. తాను బయట ఉన్నానని ఆయన సమాధానం చెబుతూ వచ్చారు. దీంతో రెవెన్యూ అధికారులకు పోలీసులు సమాచారం అందించారు. గంగవరం తహసీల్దారు, సీఐ కలిసి ఆ గది వద్దకు వెళ్లడానికి ప్రయత్నిస్తుండగా, బిల్డింగ్ వద్ద ఉన్న ఓ వ్యక్తి వచ్చి తన దగ్గర తాళాలు ఉన్నాయంటూ తెరిచాడు. ఆ గదిలో భారీగా టపాకాయల నిల్వలు ఉన్నాయి. ఇంత మొత్తంలో నిల్వలు ఉంచితే, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. టపాకాయలు ఎవరు నిల్వ ఉంచారని అధికారులు ఎవరిని అడిగినా సరైన సమాధానం ఇవ్వలేదు. భవన యజమాని వీరభద్రపై కేసు నమోదు చేసి, టపాకాయలను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

చిత్తూరులోనూ పోలీసుల దాడులు

చిత్తూరు, ఆగస్టు 24: చిత్తూరు నగరంలో టపాసుల దుకాణాలపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. రెండో పట్టణ ఎస్ఐ నెట్టికంటయ్య ఆదేశాల మేరకు ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి బజారువీధిలోని టపాసుల దుకాణాలపై దాడులు చేశారు. అనుమతి లేకుండా నిల్వ ఉంచి ఎనిమిది బాక్సుల టపాసులను సీజ్ చేశారు. అనుమతి తీసుకున్న తరువాత టపాసులను దుకాణాల్లో పెట్టుకోవాలని, అలా కాకుండా విచ్చలవిడిగా టపాసులను పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గంగవరం మండలం మారేడుపల్లె ఘటన నేపథ్యంలో ఈ దాడులు జరిపారు.

రెవెన్యూ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు

● వంద రోజుల ప్రణాళికతో చర్యలు చేపట్టిన ప్రభుత్వం



కొత్త కలెక్టరేట్‌లో రికార్డు గది వద్ద పోలీసు కాపలా

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 24: జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వంద రోజుల ప్రణాళికతో అన్ని చోట్లా వీటిని అమర్చనుంది. ఇందులో భాగంగా చిత్తూరు కలెక్టరేట్, నాలుగు ఆర్డీవో కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో వందశాతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. పాత, కొత్త కలెక్టరేట్‌ల్లోని రికార్డు రూముల వద్ద 24 గంటల నిఘా, పోలీసుల కాపలా ఉన్నారు. సుమారు రూ.లక్ష విలువైన సీసీ కెమెరాలను ఏర్పాటుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇటీవల రెవెన్యూ రికార్డులను కొందరు తగలబెడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో చాలాచోట్ల భూకబ్జా చేశారు. అధికారుల అండదండతో రెవెన్యూ రికార్డుల్లో పేర్లు మార్చేశారు. ప్రభుత్వ భూముల సర్వే నెంబర్లను సబ్‌డివిజన్ చేసి ఆన్‌లైన్‌లో తమ పేరిట, తమ బంధువర్గం పేరిట, కొద్దోగొప్పో మరింత భూమి ఉంటే తమ అనుచరుల పేరిట నాటి వైసీపీ నాయకులు నమోదు చేయించుకున్నారు. అసైన్మెంట్ జరగకపోయినా జరిగినట్లు డి-పట్టాలు మంజూరు చేయించుకుని రికార్డుల్లో రాసేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో ఎక్కడ తమ అక్రమాల గుట్టు బయటపడుతుందోనని భయపడి కార్యాలయాలకు నిప్పు పెట్టడానికి కూడా వెనుకాడలేదు. ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో వందలాది రెవిన్యూ కీలక ఫైళ్ళు కాలిపోయిన ఘటన సంచలనం కలిగించింది. ఈ క్రమంలో జిల్లాలోనూ రికార్డుల భద్రతపై అధికారులు అప్రమత్తమయ్యారు. ఇక్కడి 31 తహసీల్దార్ కార్యాలయాల్లో ఫైళ్ల రికార్డు గదులు అస్తవ్యస్తంగా మారాయి. నిబంధనల ప్రకారం వాటికి సంబంధించిన తాళాలు డిప్యూటీ తహసీల్దార్ వద్ద ఉండాలి. చాలాచోట్ల వీఆర్ఏలు, రికార్డు అసిస్టెంట్ల వద్ద ఉంటున్నాయి. ఈ చర్యే అక్రమాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో పాత రికార్డులు, మేన్యువల్ అడంగళ్లు, ఆర్ఎస్ఆర్ రికార్డులు, వెబ్‌ల్యాండ్ డేటా తదితర అంశాల భద్రతలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కార్యాలయ లోపల, బయట కలిపి కనీసం రెండు సీసీ కెమెరాల ఏర్పాటు.. రాత్రి వేళల్లో కాపలాదారు ఉండటం.. తహసీల్దార్ ఆఫీసు ప్రాంతంలో బీట్ కానిస్టేబుల్ తిరగడం.. రికార్డులు, కంప్యూటర్లకు సైతం భద్రతాచర్యలు తీసుకోవడం వంటి దిశగా దృష్టి పెట్టారు.

పర్యవేక్షణకు అధికారులు

మదనపల్లె ఘటన తర్వాత రెవెన్యూ శాఖపై నిఘా పెంచింది. డీఆర్వోను జిల్లా నోడల్ ఆఫీసర్‌గా నియమించింది. నిత్యం రెవిన్యూ డివిజన్, తహసీల్దార్ కార్యాలయాల నుంచి నివేదికలు కోరుతున్నారు. సేకరించిన వివరాలను నోడల్ ఆఫీసర్ జేసీ, కలెక్టర్ సంతకాలతో భూపరిపాలనా శాఖకు పంపిస్తున్నారు.

జూనియర్ డాక్టరుపై దాడికి పాల్పడుతున్న బంగారు రాజు





'కోల్‌కతా'వంటి ఘటన

జరిగితేనే స్పందిస్తారా?

● స్విమ్స్‌లో వైద్యురాలిపై రోగి దాడి చేయడంతో నిరసనకు దిగిన జూడాలు
● రక్షణపై టీటీడీ ఈవో హామీ ఇవ్వాలంటూ డిమాండ్

వారం కిందట స్విమ్స్ ఆవరణలోనే విధులకు వస్తున్న వైద్యురాలితో ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీనిపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాం. ఇప్పటి వరకు ఎలాంటి చర్యల్లేవు. కేసూ నమోదు చేయలేదు. ఇప్పుడు.. ఓ మహిళా డాక్టరుపై రోగి దాడి చేశారు. సహచర వైద్యులు అడ్డుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇలాంటివి చాలా జరిగాయి. ఈ పరిస్థితుల్లో మేమెలా వైద్యం అందించగలం? కోల్‌కతా లాంటి ఘటనలు జరిగితే కానీ స్పందించరా?

ఇదీ టీటీడీ యాజమాన్యానికి స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్ల (జూడాలు) సూటి ప్రశ్న.

తిరుపతి(వైద్యం), ఆగస్టు 24: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని వ్యతిరేకిస్తూ ఓ పక్క నిరసనలు చేస్తుంటే.. స్విమ్స్‌లో ఓ వైద్యురాలిపై రోగి దాడి చేయడం కలకలం సృష్టించింది. శనివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో స్విమ్స్ అత్యవసర విభాగంలో విధుల్లో ఉన్న హౌస్‌సర్జన్ డాక్టర్ స్పందనపై అక్కడ చికిత్స పొందుతున్న బంగారు రాజు అనే రోగి దాడికి పాల్పడ్డాడు. విజయనగరం జిల్లాకు చెందిన ఇతను శుక్రవారం శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో తొలుత తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి స్విమ్స్‌కు రెఫర్ చేయడంతో అత్యవసర విభాగానికి తీసుకొచ్చి, చికిత్స అందిస్తున్నారు. ఉన్నట్టుండి ఇతడు విధుల్లోని జూనియర్ డాక్టర్ స్పందన తలను మంచానికేసి కొట్టాడు. మిగతా వైద్యులు అతడిని అడ్డుకోవడంతో స్వల్ప గాయంతో ఆమె బయటపడ్డారు. గతంలోనూ ఇలాంటి ఘటనలు జరిగాయని, తమకు రక్షణ లేదంటూ స్విమ్స్‌లోని జూనియర్ డాక్టర్లు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అత్యవసర విభాగం ముందు నిరసనకు దిగారు. రెండు గంటల పాటు వీరి నిరసనను ఎవరూ పట్టించుకోక పోవడంతో డైరెక్టర్ డౌన్ డౌన్, ప్రిన్సిపాల్ డౌన్ డౌన్, నో సేఫ్టీ.. నో సర్వీస్ అంటూ నినాదాలు చేశారు. స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఉషా కళావత్ వచ్చి జూడాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. 'మీ మాటలపై మాకు నమ్మకం లేదు. టీటీడీ ఈవో వచ్చి మా రక్షణపై లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే నిరసన విరమిస్తాం' అని భీష్మించుకున్నారు. రాత్రి ఎనిమిది గంటల తర్వాత టీటీడీ అదనపు సీవీఎస్వో శివకుమార్ వచ్చి.. ప్రస్తుతం ఉన్న 140 మంది సెక్యూరిటీతోపాటు అదనంగా మరో 70 మందితో భద్రతా చర్యలు చేపడతామని, రాపిడ్ సెక్యూరిటీ ఫోర్స్ ఏర్పాటు, మొబైల్ రక్షక భటులతో నిరంతరం గస్తీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనికికూడా జూడాలు శాంతించలేదు. భద్రత కల్పించే బాధ్యత తమదని వెస్ట్ డీఎస్పీ వెంకట నారాయణ హామీ ఇవ్వగా.. వారం కిందట ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడంపై ఫిర్యాదు చేస్తే ఇంత వరకు కేసు ఎందుకు నమోదు చేయలేదని జూడాలు ప్రశ్నించారు. కేసు ఎందుకు నమోదు చేయలేదని సీఐ రామకృష్ణను డీఎస్పీ అడిగారు. కేసు నమోదు చేయని వారికి వెంటనే చార్జి మెమో జారీ చేస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు. అయినా ఈవో వస్తేనే ఆందోళన విరమిస్తామని జూడాలు తేల్చిచెప్పారు. రాత్రి 11.40 గంటల ప్రాంతంలో జేఈవో గౌతమి వచ్చి సర్దిచెప్పినా జూడాలు వినిపించుకోకుండా నిరసన కొనసాగించారు.

మాపై ఎందుకింత నిర్లక్ష్యం

న్యాయం కోసం గంటల తరబడి నిరసన తెలుపుతున్న మా కోసం ఒక్క పది నిమిషాలు వచ్చి వెళ్లే సమయం టీటీడీ అధికారులకు లేదా? మాపై ఎందుకింత నిర్లక్ష్యం? డ్యూటీలో ఉన్న వైద్యులకు గట్టి భద్రత కల్పించమనే కదా అడుగుతున్నాం.

- తేజశ్రీ, జూనియర్ డాక్టరు

వైద్యురాలి ప్రాణాలు పోయి ఉంటే..

కోల్‌కతాలో వంటి ఘటన ఇక్కడ జరిగితేనే టీటీడీ అధికారులు స్పందిస్తారా? మాకు రక్షణ కల్పించడానికి ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలియడం లేదు. ఈ రోజు జరిగిన దాడిలో వైద్యురాలి ప్రాణాలు పోయి ఉంటే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు?

- విష్ణుశ్రీ, జూనియర్ డాక్టరు

31న రాజనాలబండ తిరునాళ్లు


తిరునాళ్లు గురించి మాట్లాడుతున్న టీటీడీ ఏఈవో మునికృష్ణారెడ్డి

చౌడేపల్లె, ఆగస్టు 24: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో ఈనెల 31, సెప్టెంబరు ఒకటో తేదీన తిరునాళ్లు నిర్వహించనున్నట్లు టీటీడీ ఏఈవో మునికృష్ణారెడ్డి తెలిపారు. ఆలయ నిర్వాహకులు, పరిసర గ్రామాల ప్రజలు, పెద్దలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. రాజనాలబండ ఆలయం టీటీడీ అధీనమైన తర్వాత జరిగే మొదటి తిరునాళ్లు కావడంతో గతంలో కన్నా ఇంకా ఘనంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. సంప్రదాయబద్ధంగా, ఆనవాయితీగా వచ్చే కార్యక్రమాలు, ఊరేగింపులు అలానే కొనసాగుతాయన్నారు. తిరునాళ్లలో ఏయే గ్రామాలు చేసే పనులు వారే చేసేలా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి కొండ చిలువ



పెనుమూరు, ఆగస్టు 24: మండలంలోని సీఎస్ అగ్రహారం గ్రామ సమీపంలోకి కొండ చిలువ వచ్చింది. రైతు మురుగన్ గమనించి, గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి చేరుకుని పామును కొట్టి చంపారు. నెల రోజుల్లో రెండవసారి కొండ చిలువ కనిపించడంతో గ్రామస్తులు భయబ్రాంతులకు గురవుతున్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలపై సమీక్ష


ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ సంక్షేమ కమిటీ సమావేశంలో దగ్గుమళ్ల

చిత్తూరు సిటీ, ఆగస్టు 24: ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా శనివారం ఢిల్లీలో ఎస్సీ, ఎస్టీ పార్లమెంటరీ సంక్షేమ కమిటీ సమావేశం జరిగిందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలు, వాటికి ప్రభుత్వం ఏ మేరకు సహకరిస్తుంది అనే అంశాలపై సమీక్షించామని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తింపజేస్తున్నారా.. రోస్టర్ విధానం అమలవుతోందా... లేదా.. అన్న విషయాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారని తెలిపారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

బండరాయి పడి హిటాచీ డ్రైవర్ మృతి


బాలెందర్ (ఫైల్ ఫొటో)

గుడిపాల, ఆగస్టు 24: బండరాయి పడి హిటాచి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని అరుళ్‌పురం చర్చి వద్ద శనివారం చోటుచేసుకుంది. హైవే పనుల నిమిత్తం హిటాచీతో పెద్దరాళ్లను తీసుకొచ్చి దొర్లిస్తుండగా అందులో ఒకటి డ్రైవర్ బాలెందర్ (24)పై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వాడని ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేపటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవం

చిత్తూరు రూరల్, ఆగస్టు 24: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 26న ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, 27న విద్యార్థులతో ప్రతిజ్ఞ, 9, 10 తరగతి విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. 28న 18-60 వయస్సున్న వారికి క్రీడా పోటీలు నిర్వహించాలని తెలిపారు. 29న ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నివాళి అర్పించాలని సూచించారు. 30న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ క్రీడాకారులకు సన్మానం చేయాలని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో 'సరిపోదా శనివారం'


ఆలయం ముందు నాని, ప్రియాంక

'సరిపోదా శనివారం' చిత్ర హీరో నాని, హీరోయిన్ ప్రియాంక మోహన్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈనెల 29వ తేదీన ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో వీరు శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. రాత్రి తిరుమలలోనే బస చేసి శనివారం ఉదయం నాని దంపతులతోపాటు ప్రియాంక ఆలయంలోకి వెళ్లి తిరుమలేశుడి సేవలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

జాప్యం లేకుండా భక్తులకు దర్శనం

అదనపు ఈవో వెంకయ్య ఆదేశం

తిరుమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కంపార్టుమెంట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా భక్తులను దర్శనానికి అనుమతించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం తెల్లవారుజామున తిరుమలలో ఆయన విస్తృత తనిఖీలు చేశారు. ముందుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్-1, కృష్ణతేజ సర్కిల్, నారాయణగిరి ఉద్యానవనంలోని షెడ్లు, క్యూలైన్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై ఆయన భక్తులకు అవగాహన కల్పించారు. కంపార్టుమెంట్లలో వడ్డించిన ఉప్మా చాలా రుచికరంగా ఉందని భక్తులు అదనపు ఈవోకు చెప్పి ఆనందాన్ని వ్యక్తం చేశారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో తాగునీరు, అన్నప్రసాదాలు, పాలు అందించే విధానాన్ని పరిశీలించి, కంపార్టుమెంట్ల వెలుపల ఉన్న బోర్డులపై భక్తులకు అందించే ఆహార పానీయాలు, సమయాలను పేర్కొనాలని అధికారులను ఆదేశించారు. కంపార్టుమెంట్లలో మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. కృష్ణతేజ సర్కిల్ వద్ద భక్తులు క్యూలైన్‌లోకి ప్రవేశించే మార్గాల వద్ద కొందరు ప్రైవేట్ ట్యాక్సీ, జీప్ డ్రైవర్లు అడ్డంగా పార్కింగ్ చేయడాన్ని గమనించి, డ్రైవర్లను హెచ్చరించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి అనధికారిక పార్కింగ్ నివారించేందుకు, స్థానిక పోలీసులతో చర్చలు జరపాలని టీటీడీ విజిలెన్స్ అధికారులను వెంకయ్య చౌదరి ఆదేశించారు.

హరియాణా ముఠా అరెస్టు

అనంత, చిత్తూరు, కర్ణాటకలో ఏటీఎంలలో చోరీలు

అర కోటికి పైగా మాయం.. రూ.2 లక్షలే రికవరీ

పట్టుబడింది ఐదుగురు.. పరారీలో ఏడుగురు




పట్టుబడిన దొంగల ముఠా సభ్యులు - స్వాధీనం చేసుకున్న నగదు, ఆయుధాలు, సామగ్రి - పట్టుబడిన లారీ

అనంతపురం క్రైం, ఆగస్టు 24: ఏటీఎంలలో చోరీలకు పాల్పడుతున్న హరియాణా దొంగల ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో రూ.అర కోటికి పైగా డబ్బు చోరీ చేసిన చేసిన వీరి నుంచి రూ.2లక్షలు మాత్రమే పోలీసులు రికవరీ చేశారు. ఈ ముఠాను పట్టుకునేందుకు అనంతపురం నగరంలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల సీఐలు, సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్, టెక్నికల్ స్టాఫ్, కర్ణాటక పోలీసులు శ్రమించారు. మొత్తం 12 మంది సభ్యులున్న ముఠాలో ఐదుగురు దొరికారు. మిగిలినవారు పరారీలో ఉన్నారు. ఈ కేసు వివరాలను ఎస్పీ జగదీష్ శనివారం డీపీఓలో వెల్లడించారు.

అరెస్టయింది వీరే..

హరియాణాలోని నుహ్ జిల్లా అలీమియో గ్రామానికి చెందిన రాబిన్, ఘసేరాకు చెందిన సలీం, రోజ్ కామియో గ్రామానికి చెందిన హక్మాఖాన్, అలీమియో గ్రామానికి చెందిన షాకీర్, రాజస్థాన్‌లోని భరత్ పుర జిల్లా అల్‌గని గ్రామానికి చెందిన మజీద్ అరెస్టు అయ్యారు. వసీం, సద్దాం, టౌసిఫ్, రాహుల్, హర్షద్, వారీష్, అతావుల్లా పరారీలో ఉన్నారు.

ఇవీ చోరీలు..

ఈ నెల 8న అనంతపురం నగరంలోని రామ్‌నగర్ ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ చేశారు. ప్రస్తుతం అరెస్టయిన ఐదుగురు, పరారీలో ఉన్న ఏడుగురు అక్కడికి వెళ్లారు. పోలీసులు, స్థానికులు గమనించకుండా ఎనిమిది మంది ఏటీఎం వద్ద వలయంగా ఏర్పడ్డారు. గ్యాస్ కట్టర్ నిపుణుడు సద్దాం సహా నలుగురు ముఖాలకు ముసుగులేసుకుని ఏటీఎం మిషన్‌ను కట్ చేశారు. అందులో ఉన్న రూ.29.80 లక్షలను ఎత్తుకెళ్లారు. ఇదే తరహాలో ఈ నెల 2న కల్లూరు ఎస్బీఐ ఏటీఎంలో రూ.3,26,600, జూన్ 7న కూడేరు మండల కేంద్రంలో రూ.18,41,300 ఏటీఎంలలో చోరీ చేశారు. ఫిబ్రవరి 8న అనంతపురం నగరంలోని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి నగదు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీస్‌సైరన్ రావడంతో పారిపోయారు. కర్ణాటక రాష్ట్రంలోని చిక్‌బళ్లాపూర్‌లో ఏటీఎం సెంటర్‌లో రూ.18,24,500 చోరీ చేశారు. చిత్తూరు జిల్లా గుడిపాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటీఎం సెంటర్లో రూ.25,98,400 చోరీ చేశారు.

అరెస్టు ఇలా..

అనంతపురం జిల్లాలో వరుసగా ఏటీఎంలలో చోరీలు జరగడంతో అప్పటి ఎస్పీ కేవీ మురళీకృష్ణ, నూతన ఎస్పీ జగదీష్ కేసులను ఛేదించాలని ఆదేశించారు. డీఎస్పీ టీవీవీ ప్రతాప్ ఆధ్వర్యంలో సీఐలు ఇస్మాయిల్, ప్రతాప్‌రెడ్డి, శ్రీధర్, శివరాముడు, షేక్ జాకీర్, సాయినాథ్, ఎస్‌ఐలు నాగమధు, గౌస్‌బాషా, రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో హెచ్‌సీలు శివయ్య, మల్లికార్జున, నాగరాజు, కానిస్టేబుళ్లు రంజిత్, దాస్, ఆసిఫ్, ప్రసాద్, అనిల్, ఫరూక్, బాలు, ఓబుళేసు, వెంకటరమణ బృందాలుగా ఏర్పడ్డారు. ముఠాలోని ఐదుగురిని అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి క్రాస్ సర్వీస్ రోడ్డు పక్కన పొదలలో అరెస్టు చేశారు. నిందితుల నుంచి గ్యాస్ సిలిండర్, గ్యాస్ కట్టర్, 5 సెల్‌ఫోన్లు, రూ.2లక్షల నగదు, 3 ఇనుప రాడ్లు, ఒక బాకు, కారం పొడి ప్యాకెట్, శానిటైజర్ స్ప్రే బాటిల్, పెయింట్ స్ప్రేలు, ఒక లారీని స్వాధీనం చేసుకున్నారు. డీజీపీ ద్వారకా తిరుమల రావు వీరిని అభినందించారు.

ముఠా నేపథ్యం ఇది..

ముఠాలో రాబిన్, సలీం కీలక నిందితులు. షాకీర్ ట్రక్ డ్రైవర్. హరియాణా నుంచి బెంగళూరు హైవే మీద ప్రయాణిస్తూ.. ఏటీఎం కేంద్రాలు, అక్కడి భద్రత, సీసీ కెమెరాలు, రద్దీని గుర్తిస్తాడు. సులువుగా దొంగతనాలు చేసేందుకు అనువుగా ఉన్న ఏటీఎం కేంద్రాలను ఎంపిక చేసి.. రాబిన్, సలీంకు సమాచారం చేరవేస్తాడు. గ్యాస్ కటింగ్‌లో అనుభవమున్న సద్దాంతో రాబిన్ చర్చించి.. మిగిలిన సభ్యులను సమీకరించుకుంటాడు. అనంతరం ముఠా సభ్యులు నకిలీ నంబర్లతో రెండు కార్లలో ఎంపిక చేసుకున్న ఏటీఎం కేంద్రాలకు వస్తారు. ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో.. అర్ధరాత్రి 2 గంటల నుంచి తెల్లవారు జామున 4 గంటల మధ్యలో చోరీ చేస్తారు. చోరీ చేసిన సొమ్ములో కొంత మొత్తాన్ని ముఠా సభ్యులకు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని రాబిన్ తన వద్దే ఉంచుకుంటాడు. హరియాణా వెళ్లాక వాటాలు వేసుకుంటారు. ఎస్‌బీఐ ఏటీఎంలలో ఎక్కువ నగదు ఉంటుందని.. వాటినే ఎక్కువగా చోరీలకు ఎంచుకుంటారు. చిత్తూరు జిల్లా గుడిపాల ఏటీఎం చోరీలో కేసులో రాబిన్, సద్దాం, టౌసిఫ్ నిందితులు.

మొదలైంది



- తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై సీఐడీ విచారణ
- పలు ఫైళ్ల స్వాధీనం
- సహకరించని అధికారులు?

తిరుపతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణంపై సీఐడీ అధికారులు విచారణ మొదలుపెట్టారు. శనివారం నలుగురు సీఐడీ అధికారుల బృందం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లింది. పట్టణ ప్రణాళిక విభాగంలో పలు డాక్యుమెంట్లను పరిశీలించారు. టీడీఆర్ బాండ్ల అవకతవకలపై వివరాలు సేకరించారు. స్థల సేకరణలో ఎకరాల్లో గుర్తించి, బాండ్ల జారీకి చదరపు గజాల్లో లెక్కించినట్టు, అగ్రికల్చర్, రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధిపొందినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్టు సమాచారం. మరింత లోతుగా విచారించేందుకు తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో ఒక గదిని ఏర్పాటు చేయాలని సీఐడీ బృందం మున్సిపల్ ఉన్నతాధికారులను అడిగినట్టు తెలిసింది. అయితే టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి.. సీఐడీ అధికారుల బృందం వచ్చే సమయంలో కార్యాలయం నుంచి ఉద్దేశపూర్వకంగానే వెళ్లిపోయినట్టు సమాచారం. దీంతో కిందిస్థాయి సిబ్బందితో మాట్లాడి పలు ఫైళ్లను తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే తిరుపతి కార్పొరేషన్లో డిప్యుటేషన్‌పై పనిచేసిన అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రహ్మణ్యంపై పదిరోజుల క్రితం ప్రభుత్వం బదిలీ వేటు వేసిన విషయం తెలిసిందే. తిరుపతి ఏసీపీగా డిప్యుటేషన్ రద్దు చేస్తూ రాజంపేట మున్సిపాల్టీ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ (టీపీవో)గా బదిలీచేశారు. అయితే అక్కడ బాధ్యతలు స్వీకరించకుండా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ప్లానింగ్ విభాగంలో చేరేందుకు బాలసుబ్రహ్మణ్యం చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది. ఆయనకు తుడా ప్లానింగ్ విభాగంలో పోస్టింగ్ ఇవ్వాలని తిరుపతి, చంద్రగిరి కూటమి ఎమ్మెల్యేలు కూడా సిఫారసు లేఖలు అందజేసినట్టు సమాచారం. ఓవైపు టీడీఆర్ బాండ్ల అక్రమాలను నిగ్గు తేల్చాలని టీడీపీ నేతలు ఆనం వెంకటరమణారెడ్డి, రవినాయుడు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి విచారణకు ఆదేశిస్తే, మరోవైపు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను తిరిగి తెప్పించుకునేందుకు కూటమి ఎమ్మెల్యేలే సమర్థించడం విమర్శలకు తావిస్తోంది.

బాలికను వేధించిన యువకుల అరెస్టు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 24: మండలానికి చెందిన బాలిక(14) వెదురుకుప్పం మండలంలోని ఓ ఉన్నత పాఠశాలలో చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన అంబేడ్కర్ (26) రవీంద్ర(23) ఆమెను వేధిస్తుండడంతో పాఠశాలకు వెళ్లడం మానేసింది. తల్లిదండ్రులు ఆరా తీయడంతో విషయం బయటపడింది. ఆమె తండ్రి యువకులను నిలదీయడంతో రాడ్‌తో దాడి చేశారు. గాయపడిన బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు యువకులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని కార్వేటినగరం సీఐ హనుమంతు తెలిపారు.

రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్

అనుచరులతో కలిసి ఓ కుటుంబంపై దాడి ● ఇద్దరికి గాయాలు


గాయపడ్డ చంద్రబాబు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 24: తిరుపతి పరిసర ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. తాజాగా ఓ బ్యాచ్ ఇంటిమీద దాడిచేసి ఇద్దరిని గాయపరిచింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటకు చెందిన టీడీపీ నేత చంద్రబాబు నాయుడు తన భార్య మల్లికతో కలిసి పది రోజుల క్రితం ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతున్నారు. మల్లంగుంట వినాయకనగర్‌కు చెందిన రౌడీషీటర్ కుల్లా అలియాస్ వెంకటేష్, తన అనుచరులు కొందరు ఉప్పరపల్లె చెక్‌పోస్టు వద్ద రోడ్డుకు అడ్డంగా కారు ఆపి మద్యం తాగుతున్నారు. కారు అడ్డం తొలగించమని వారిని చంద్రబాబు కోరారు. మద్యం మత్తులో ఉన్నవారు తిరస్కరించారు. చేసేదేమీలేక పక్క నుంచి వెళుతుండగా కారుతో ఢీకొట్టారు. ఆ ప్రమాదం నుంచి తప్పించుకుని ఎలాగోలా చంద్రబాబు దంపతులు ఇంటికి చేరుకున్నారు. వారం తర్వాత వెంకటేష్, అతడి అనుచరులు ఢిల్లీ, హరి, ఈశ్వర్‌తోపాటు మరి కొందరితో చంద్రబాబు ఇంటి ముందుకొచ్చి భారీ ఎత్తున టపాసులు కాలుస్తూ దుర్భాషలాడారు. ఈనేపథ్యంలో వారు మళ్లీ శుక్రవారం అర్ధరాత్రి చంద్రబాబు ఇంటికొచ్చి బయటకు రావాలంటూ కేకలేశారు. చంద్రబాబు, ఆయన భార్య మల్లిక, అమ్మ శాంతమ్మ ఇంటి తలుపుతీసి బయటికొచ్చారు. ఏంటని అడిగేలోపే.. ఖాళీ బీరు బాటిళ్లతో చంద్రబాబు, ఆయన భార్యపై దాడిచేశారు. చంద్రబాబు తీవ్రంగా గాయపడగా, మల్లికకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు శనివారం తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిని చికిత్స నిమిత్తం రుయాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ షేక్ షావలి తెలిపారు. దాడి చేసిన కుల్లాపై ఇదివరకే రౌడీషీట్ ఉందని.. అతడితోపాటు అనుచరులను త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

అక్టోబరు 4 నుంచి 12 వరకు
అంగరంగ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు - టీటీడీ ఈవో



తిరుమల, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మంతో కలిసి ఆయన టీటీడీలో అన్ని విభాగాల అధికారులతో తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ.. పెరటాశి(తిరుమల శనివారాలు) మాసం కూడా జతకానున్న నేపథ్యంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. 4వ తేదీన ధ్వజారోహణం ఉంటుందని, ఆరోజున సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరుపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఉదయం 8నుంచి 10 గంటల వరకు, రాత్రి 7నుంచి 9 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయని తెలిపారు. గరుడ వాహనసేవ మాత్రం సాయంత్రం 6.30 గంటలకు మొదలవుతుందన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా తిరుమల శ్రీవారి ఆలయంలో పలు ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు చేశామని తెలిపారు. సుమారు ఏడు లక్షల లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచుతామన్నారు. టీటీడీ విజిలెన్స్, జిల్లా పోలీసులతో పటిష్ఠ భద్రతాఏర్పాట్లు చేస్తామన్నారు. గరుడసేవకు ప్రత్యేకంగా అదనపు భద్రతను కల్పిస్తామన్నారు. నిత్యం కామన్ కమాండ్ సెంటర్ ద్వారా భద్రతను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల, తిరుపతిలో ఇంజనీరింగ్ పనులు వేగంగా చేస్తున్నామని, భక్తులకు ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు ఉంటాయన్నారు. వాహనసేవలు వీక్షించేందుకు మాడవీధుల్లో గ్యాలరీలు, పెద్ద డిజిటల్ స్ర్కీన్లు ఏర్పాట్లు చేస్తామన్నారు. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు కాటేజీల దాతలకు గదుల కేటాయింపు రద్దు చేసినట్టు వెల్లడించారు. తిరుమలలో వసతి లభించని భక్తులు తిరుపతిలోనే బస పొందాలన్నారు. కల్యాణకట్ట, మినీకల్యాణకట్టల్లో క్షురకులు నిరంతరాయంగా భక్తులకు సేవలందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి అదనపు సిబ్బంది ఏర్పాటు చేసినట్టు వివరించారు. నిరంతరాయంగా అన్నప్రసాదాల వితరణ జరుగుతుందన్నారు. సరిపడ వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. బ్రహ్మోత్సవాల్లో దాదాపు 4 వేల మంది శ్రీవారి సేవకులు సేవలందిస్తారని తెలిపారు. ఎప్పటిలానే ఫొటో ఎగ్జిబిషన్, ఫల పుష్ప ప్రదర్శనశాల, ఆయుర్వేద, శిల్ప ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కళాబృందాలు వచ్చి వాహనసేవల్లో ప్రదర్శనలు ఇస్తాయని చెప్పారు. గరుడసేవ రోజున ఘాట్‌రోడ్డులో ద్విచక్రవాహనాల రాకపోకలను రద్దుచేశామన్నారు. అలిపిరి పాత చెక్‌పోస్టు, శ్రీవారిమెట్టు వద్ద ద్విచక్రవాహనాల పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేస్తామన్నారు. మాడవీధుల్లో కార్నర్ పాయింట్స్‌లో అదనంగా భక్తులు వాహనసేవలు దర్శించే అంశంపై పరిశీలన చేస్తామని ఓ ప్రశ్నకు ఈవో బదులిచ్చారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రెండు నెలల్లో హంద్రీ -నీవా పనులు పూర్తి


చిన్నారిదొడ్డి వద్ద చేపట్టిన పనులు

శాంతిపురం, ఆగస్టు 24: కుప్పం ప్రజలకు తాగు, సాగు నీరందించేందుకు తీసుకు వచ్చిన హంద్రీ -నీవా కాల్వ పనులు మరో రెండు నెలల్లో పూర్తిచేయనున్నట్లు మండల టీడీపీ కార్యదర్శి నాగరాజు అన్నారు. మండల పరిధిలోని చిన్నారిదొడ్డి వద్ద హంద్రీ -నీవా కాల్వ పనులను శనివారం పునఃప్రారంభించారు. డిసెంబరు నెలాఖరుకు కాల్వ ద్వారా నీరందిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చలపతి, హనాథరెడ్డి, శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

రాజనాలబండలో శ్రావణ శనివార పూజలు

చౌడేపల్లె, ఆగస్టు24: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. తర్వాత ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉపవాస దీక్షతో స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక బస్టాండులో వెలసిన కమలాంజనేయ స్వామి, కర్లంవారిపల్లె అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీ కార్యకర్తల అన్నదానం


తండ్రి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, ఆగస్టు24: టీడీపీ మాజీ మండ లాధ్య క్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి వర్థంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం మండలంలోని తెల్లనీళ్ల పల్లెలోని సమాధి వద్ద ఆయన కుమారుడు టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి , కుటుంబసభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక బస్టాండులో టీడీపీ కార్యకర్తలు అన్నదానంచేశారు. పీహెచ్‌సీలో రోగులకు పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు.

నేడు జనసేన పార్టీ విజయోత్సవ ర్యాలీ

కల్లూరు, ఆగస్టు 24: పులిచెర్ల మండలంలో ఆదివారం జనసేన పార్టీ విజయోత్సవ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రబాబు తెలిపారు. మంగళంపేటలో ఉదయం 9 గంటలకు ర్యాలీ ప్రారంభమై కొత్తపేట, కొమ్మిరెడ్డిగారిపల్లి మీదుగా కూనపల్లి వరకు సాగుతుందన్నారు. అనంతరం కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపంలో బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. ఈ సభకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. జనసేన పార్టీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

రామకుప్పం, ఆగస్టు 24: మండలంలోని సింగసముద్రానికి చెందిన విభిన్న ప్రతిభా వంతురాలు రీఫా కొన్నేళ్లుగా వినికిడి సమస్యతో బాధపడుతోంది. ఆమెకు సర్జరీ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని, సర్జరీ కోసం రూ.4.50లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో ఆమె సీఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందించాలని సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించింది. స్పందించిన సీఎం చంద్రబాబు ఆమెకు తిరుపతి బర్డ్‌లో సర్జరీ చేసేందుకు రూ.4.50లక్షల మంజూరు చేస్తూ ఎల్‌ఓసీని కుప్పం టీడీపీ కార్యాలయానికి పంపారు. ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్ శనివారం ఎల్‌ఓసీ పత్రాన్ని రీఫా కుటుంబసభ్యులకు అందజేశారు.

మరుగుదొడ్ల ఫొటోల నుంచి విముక్తి కల్పించండి

రామకుప్పం, ఆగస్టు 24: పాఠశాలల్లో మరుగుదొడ్లను ఫొటోలు తీసే పని నుంచి తమకు విముక్తి కల్పించాలని మండలంలోని సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు కోరారు. శనివారం వారు మండల మానవ వనరుల కేంద్రంలో ఎంపీడీఓ ఈశ్వరన్న, ఎంఈఓ నారాయణలకు వినతిపత్రం అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి చెల్దిగానిపల్లె విద్యార్థిని


చతుర్నిక

రామకుప్పం, ఆగస్టు 24: మండలంలోని చెల్దిగానిపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని చతుర్నిక ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు రాణెమ్మ తెలిపారు. చతుర్నికను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

తిమ్మరాయస్వామికి ప్రత్యేక పూజలు

గుడుపల్లె, ఆగస్టు 24: మండలం పరిధిలోని శిరిగిరిపల్లెలోని వెలసిన తిమ్మరాయస్వామికి శనివారం శ్రావణ శనివార పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు ఉపవాస దీక్షతో స్వామివారి ఆలయానికి చేరుకొని కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

చెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల, ఆగస్టు24: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రావణమాస శనివారం పూజలు చేశారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టారు. హరిస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆరోగ్యానికి పెద్దపీట

శాంతిపురం, ఆగస్టు 24: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ అన్నారు. శనివారం శాంతిపురం జూనియర్ కళాశాలలో ప్రత్యేక కంటివైద్య శిబిరం నిర్వహించారు. 576 మందికి పరీక్షలు నిర్వహించారు. 118 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. 105 మందికి కంటి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. ఎమ్మెల్సీ కంటి అద్దాలను అందించారు. కడా ఎస్‌వో వికాస్ మర్మత్, మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, జన సేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుంపర్ల సేద్యంపై అవగాహన

శాంతిపురం, ఆగస్టు 24: రైతులు బిందు, తుంపర్ల సేద్యం ద్వారా తక్కువ నీటితో అధిక, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ చేతుల మీదుగా ఉద్యానశాఖ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ రాయితీల గురించి వివరించారు. కుప్పం టీడీపీ ఇన్‌చార్జ్ పీ.ఎస్.మునిరత్నం, మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథనాయుడు, నేతలు విజయరామిరెడ్డి, అనసూయ, ఉద్యానశాఖ ఉపసంచాలకులు కోటేశ్వర్‌రావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కుప్పం, ఆగస్టు 24: కుప్పం పట్టణం గుడుపల్లె రోడ్డులో వెలసిన ప్రసన్న కృష్ణార్జున స్వామివారి ఆలయంలో ఈనెల 26న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బీఎం.దయానిధి తెలిపారు. స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేస్తామన్నారు. భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

కుప్పం ఎంపీడీవోగా సాయి లహరి



కుప్పం, ఆగస్టు 24: కుప్పం ఎంపీడీవోగా పి.సాయి లహరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండలం నుంచి కుప్పం బదిలీ అయ్యారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఖాదర్‌బాషా బుచ్చినాయుడు కండ్రిగకు బదిలీపై వెళ్లారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు ఆహ్వానం

పలమనేరు, ఆగస్టు24 : పలమనేరులో ఈ నెల 26వ తేదీ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రభోధసేవాసమితి- ఇందుజ్ఞానవేదిక పలమనేరు కమిటీ అధ్యక్షులు భాస్కర్ తెలిపారు. స్థానిక బసవన్న ఆలయం నుంచి ఊరేగింపు ఉంటుందని వివరించారు. శనివారం స్థానిక తహసీల్దార్‌కు, పట్టణంలోని ప్రముఖులను జన్మాష్టమి వేడుకలకు ఆహ్వానించినట్లు తెలిపారు.

తులసినాథం నాయుడుకు గిడుగు పురస్కారం



పలమనేరు, ఆగస్టు24: పలమనేరులోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి.తులసినాథం నాయుడు గిడుగు జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నెల 29న తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగే గిడుగు జయంతి వేడుకల్లో పురస్కారాన్ని అందజేస్తారు. కొన్నేళ్లుగా తులసినాథం నాయుడు తెలుగుభాష కోసం చేస్తున్న సేవలను గుర్తించి ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిసింది.

విద్యుత్ వైర్ల చోరీ.. నిందితుడి అరెస్ట్

పుంగనూరు రూరల్, ఆగస్టు24: విద్యుత్ వైర్లు చోరీకి పాల్పడిన నిందితున్ని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ఆరడిగుంట పంచాయతీ అమ్మిగానిపల్లె సమీపంలోని నిర్మిస్తున్న ఫ్యాక్టరీ వద్ద నిల్వ ఉంచిన 11కట్టల విద్యుత్ వైరును మదనపల్లెకు చెందిన సునీల్‌కుమార్(30) ఈ నెల 14న చోరీ చేశాడు. ఫ్యాక్టరీ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ నాగలింగం ఫిర్యాదు మేరకు ఆరడిగుంటగ్రామం వద్ద సునీల్ కుమార్ అనుమానాస్పదంగా తిరుతుండగా అరెస్టు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠా అరెస్ట్

పుంగనూరు రూరల్, ఆగస్టు24: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. పుంగనూరు, రామసముద్రం, కాణిపాకం, పూతలపట్టు తదితర ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ చోరీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆరడిగుంట గ్రామ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా మాలూరు తాలూకాకు చెందిన మునిరాజ(44), శివకుమార్(30),ప్రసాద్(29), వినోద్(27)లు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారించగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేయడానికి వచ్చినట్లు అంగీకరించారు. వారిపై కేసు నమోదు చేశారు.

సారా విక్రేతల అరెస్టు

పుంగనూరు రూరల్, ఆగస్టు24: సారా విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని ఏటిగడ్డపాళ్యంలో రాజు(27), రాంబాబు సారా విక్రయిస్తూ పట్టుబడ్డారు. వారి నుంచి 55లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటి చికిత్స శిబిరాలను విజయవంతం చేద్దాం

రామకుప్పం, ఆగస్టు 24: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఈనెల 28, 30, 31 తేదీల్లో రామకుప్పం మండలంలో నిర్వహించే కంటి చికిత్స శిబిరాలను విజయవంతం చేసేందుకు అధికార, అనధికారులు సహకరించాలని తహసీల్దారు బాబు, ఎంపీడీఓ ఈశ్వరన్న కోరారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 28న విజలాపురం, వీర్నమల పీహెచ్‌సీల్లో, 30, 31 తేదీల్లో రామకుప్పం పీహెచ్‌సీలో కంటి చికిత్స శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు రైతులకు తెలియజేయాలి



రొంపిచెర్ల, ఆగస్టు24: సబ్సిడీ డ్రిప్ పరికరాల సమాచారం రైతులకు ఇవ్వాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి సూచించారు. శనివారం ఆయన ఏవో సుధారాణి, రైతు భరోసా సిబ్బందితో మాట్లాడారు. రైతులకు ఎరువులు, క్రిమి సంహారక మందులు వినియోగంపై సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు

90 శాతం సబ్సిడీతో రైతులకు
బిందు సేద్యం పరికరాలు


కుప్పంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కుప్పం, ఆగస్టు 24: బిందు సేద్య పరికరాలను రైతులకు 90 శాతం సబ్సిడీతో సరఫరా చేస్తామని జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణలు చెప్పారు. కుప్పం మండల సచివాలయంలో శనివారం ఉద్యాన, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో డ్రిప్, స్ప్రింక్లర్ల ప్రాధాన్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యం ద్వారా తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధ్యమవుతుందన్నారు. 5 ఎకరాల లోపు ఉన్న చిన్నసన్నకారు రైతులకు బిందు సేద్య పరికరాలను 90 శాతం సబ్సిడీతో గరిష్ఠంగా ఒక్కో రైతుకు రూ.2.18 లక్షలు రాయితీ పొందేలా ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. అలాగే 5-10 ఎకరాల భూమి కలిగిన రైతులకు 70 శాతం సబ్సిడీతో గరిష్ఠంగా రూ.3.46 లక్షలు సబ్సిడీ పొందేలా సరఫరా చేస్తామన్నారు. రైతులందరూ సెప్టెంబరు మొదటి వారంలోగా వారి దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు వారు వేసుకున్న పంటలను తప్పకుండా ఈ పంటలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. ఉద్యాన శాఖ ద్వారా శాశ్వత పందిళ్లు వేసిన రైతులకకు ఎకరాకు ఒక లక్ష రూపాయలు, ప్యాక్ హౌస్‌కోసం రూ.2 లక్షలు, ఫారం పాండ్ (వ్యక్తిగత నీటి కుంటలు)కు, పండ్ల తోటలు వేసుకున్న వారికి రూ.16 వేలు, పవర్ టిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్లకు 40 శాతం రాయితీ, టమోటా, వంగ, బీర, కాకర నారుకు కూడా రాయితీలు ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన ఉపసంచాలకులు కోటేశ్వరరావవు, వ్యవసాయ ఉపసంచాలకులు అన్నపూర్ణదేవి, మండల ఉద్యాన అధికారి డింపు ప్రియ, వ్యవసాయాధికారి అమృతవల్లి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, మండలంలోని రైతులు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠాన్ని సద్వినియోగం చేసుకోవాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ బాలసుందరం

పలమనేరు, ఆగస్టు24 : అర్థాంతరంగా బడి మానేసిన విద్యార్థులు ఆంధ్ర ప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో బాలసుందరం పిలుపునిచ్చారు. శని వారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అందరూ చదవాలి- అందరూ ఎదగాలి అన్న నినాదంతో ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్యా విధానం) ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ఎంఈఓ ప్రారంభించారు. అంతకు ముందు దూరవిద్యావిధానానికి సంబంధించిన కరపత్రాలకు ఉన్నత పాఠ శాలలో ఎంఈవో ఆవిష్కరించారు. ఆగిపోయిన చదువును మళ్లీ కొన సాగించి ఉన్నతస్థాయికి ఎదిగేందుకు సార్వత్రిక విద్యాపీఠం ద్వారా సాధ్యమవు తుందన్నారు. 14 సంవత్సరాలు నిండిన బడి బయట పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలమనేరు ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ షంషేర్ మాట్లా డుతూ పలమనేరులో 2024-25 విద్యాసంవత్సరానికి పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ దూరవిద్యలో చేరవచ్చన్నారు. వివరాలకు 9705989890 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

సర్క్యూట్ బ్రేకర్‌లో సాంకేతిక లోపం..వీకోటలో పవర్ కట్


సబ్ స్టేషన్‌లో మరమ్మత్తులు చేపడుతున్న సిబ్బంది

వి.కోట, ఆగస్టు 24: వి.కోట 33-11 కేవీ సబ్ స్టేషన్‌లో సర్క్యూట్ బ్రేకర్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో పగలంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొంతకాలంగా ఉన్న ఈ సమస్యపై ట్రాన్స్‌కో ఏఈ రామకృష్ణ చిత్తూరు ప్రొటె క్షన్ టీంకు సమాచారం ఇచ్చారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు సిబ్బంది కష్టపడి సాంకేతిక సమస్యను పరిష్కరిం చారు. దీంతో పగలంగా పూర్తిగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరాలో ఉన్న కోతల సమ స్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత


మొక్కలు నాటుతున్న కాలేజీ అధ్యాపకులు

పుంగనూరు రూరల్, ఆగస్టు24: సమాజంలో వాతావరణ కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ పేర్కొన్నారు. శనివారం కాలేజీ ఆవరణలో శుభారాం ట్రస్ట్ సభ్యులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ సాయి శ్రీనివాస్‌మూర్తి మాట్లాడుతూ రాబోవు తరాలకు వర్షాలు సక్రమంగా కురవాలంటే విద్యార్థులు మొక్కలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ప్రకాశ్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండవ రోజూ ఆక్రమణల తొలగింపు



చౌడేపల్లె, ఆగస్టు24: చౌడేపల్లెలో రోడ్డు ఆక్రమణలను రెవెన్యూ అధికారులు తొలగింపు చర్యలు శనివారం రెండవరోజూ కొన సాగాయి. ఎక్స్‌కవేటరుతో తహసీల్దార్ హనుమంతు ఆధ్వర్యంలో తొలగింపు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్ నాయక్, సర్వేయర్ గుణశేఖర్, వీఆర్‌వోలు, సచివాలయ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



పుంగనూరు , ఆగస్టు24: శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని శనివారం ముందస్తుగా రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడి వేషధారణలతో ఆకట్టు కున్నారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రజిని, రెడ్డెమ్మ, మునిరత్నం, జలజ, యేసుదాసు, వనిజ, సత్య, గౌతమి, బిందు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్సీ కంచర్ల


బిందుసేద్యంపై అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

రామకుప్పం, ఆగస్టు 24: రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శనివారం చెల్దిగానిపల్లెలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు బిందు సేద్యంపై నిర్వహించిన అవగాహన శిబిరం, చెల్దిగానిపల్లె ఉద్యాన రైతుల పరస్పర సహకార సంఘం 19వ వార్షిక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో బిందుసేద్యం పరికరాలు అందిస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చెల్దిగానిపల్లెకు మంజూరైన కోల్డ్‌స్టోరేజీ ప్లాంట్ ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు రామకుప్పం మండలంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రూ.18.5కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, ఏడీ కోటేశ్వరరావు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, మండల ఉద్యాన అధికారి డింపుప్రియ పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఆవులకు గాయాలు

సోమల, ఆగస్టు 24: సోమల మండలంలోని ఇరికిపెంట డ్యాం వద్ద పిచ్చి కుక్క వీరంగం సృష్టించి రెండు పాడిఆవులను గాయపరిచింది. శుక్రవారం మేటిమంద, డ్యాం వద్ద బాటసారులను ఈ పిచ్చికుక్క పలువురిని గాయపరచడంతో వైద్యశాలల్లో చికిత్సలు పొందుతున్నారు. గ్రామస్తులు పిచ్చి కోసం గాలిస్తున్నారు.

కృష్ణాష్టమికి భారీ ఏర్పాట్లు


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

పుంగనూరు , ఆగస్టు24: ఈ నెల 26న జరిగే శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. శనివారం కృష్ణమరెడ్డిపల్లె మార్గంలోని శ్రీకృష్ణుడి ఆలయం వద్ద జరిగిన యాదవ కులస్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన వంతు భక్తులకు అన్నదాన కార్యక్రమానికి రూ. 2లక్షలు, ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణం, షెడ్ల ఏర్పాటుకు రూ. 10లక్షలు నిధులు ఇవ్వనున్నట్లు తెలిపారు. యాదవసంఘ నాయకులు రెడ్డెప్పయాదవ్, గంగులమ్మ పాల్గొన్నారు.

గరుడ వాహనంపై శ్రీవారు



పుంగనూరు, ఆగస్టు 24: గరుడ వాహనంపై కళ్యాణ వెంకటరమణస్వామి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మూడవ శ్రావణ శనివారం కావడంతో స్వామిని అర్చకులు సుప్రభాతంతో మేల్కొలిపి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు, అర్చకులు శ్రీనివాసాచార్యులు అన్నదానం చేశారు.

వెంకటరమణుడిగా శనేశ్వరుడు

పుంగనూరు రూరల్, ఆగస్టు 24: పుంగమ్మ చెరువు, దండుపాళ్యం మార్గాల్లో వెలసిన శనేశ్వరస్వామి శ్రావణ శనివారం కావడంతో భక్తులకు వెంకటరమణ స్వామి అలంకరణలో దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఉపవాసాలతో స్వామివారిని దర్శించుకున్నారు.

ఇష్టపడి చదివి రాణించాలి

సోమల, ఆగస్టు 24: విద్యార్థులు ఇష్టపడి చదివి రాణించాలని ఎంఈవో శివరత్న ఆకాంక్షించారు. శనివారం నంజంపేట, కమ్మపల్లె పాఠశాలలను ఆమె సందర్శించారు. విద్యార్థుల నోటు పుస్తకాలను, వారి విద్యా ప్రమాణాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాల శుభ్రతపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పాఠశాల సమీపంలో నీటి నిల్వ గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెచ్ఎం కుసుమాంబ, ఉపాధ్యాయులు సురేశ్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామికి విశేష పూజలు

సోమల, ఆగస్టు 24: సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ జరిపారు. ఉభయదారులు అభిషేకపూజలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి సోమల, చెన్నయ్యగారిపల్లె, దాసరివారిపల్లె, దిడ్డివారిపల్లె భజనసంఘ సభ్యులచే సంకీర్తనలు ఆలపించారు.

నేడు ఉచిత కంటి వైద్యశిభిరం

శాంతిపురం, ఆగస్టు 24: రాళ్లబూదుగూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం చిత్తూరు అపోలో ఆస్పత్రి వారిచే ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శివకుమారి, డాక్టర్ ఉషారాణి తెలిపారు.

ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు


నెల్లిపట్ల పాఠశాలలో కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 24 : మండలంలోని నెల్లిపట్ల ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. దాతలు వెంకటరమణ, రమణ సహకారంతో విద్యా సామగ్రిని ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి విద్యార్థులకు పంపిణీచేశారు. హెచ్ఎం కృష్ణయ్య, ఎస్ఎంసీ చైర్మన్ నూర్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లెలోని బీజే మోడల్ స్కూల్లో కూడా ముందస్తు కృష్ణాష్టమి సంబరాలు నిర్వహించి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణారెడ్డి బదిలీ



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 24: జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణారెడ్డిని బదిలీ చేస్తూ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కో-ఆపరేటివ్ శాఖలో సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి డెప్యూటేషన్‌పై ఎస్ఎస్ ఏపీసీగా వచ్చారు. ఐదేళ్ల పదవీకాలం సెప్టెంబరుతో ముగియనుంది. ఈ క్రమంలో పేరెంట్ డిపార్టుమెంట్‌కు బదిలీ చేస్తూ ఎస్పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవోకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా కలెక్టర్ రిలీవ్ చేసే వరకు వెంకటరమణారెడ్డి ఈ పదవిలో కొనసాగుతారు.

చిత్తూరు డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఆగస్టు 24: చిత్తూరు డీఎస్పీగా సాయినాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డిని అమరావతిలో రిపోర్టు చేసుకోవాలని పంపారు. ఆయన స్థానంలో నెల్లూరు దిశా డీఎస్పీగా ఉన్న సాయినాథ్‌ను చిత్తూరుకు బదిలీ చేశారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన ఎస్పీ మణికంఠను మర్యాదపూర్వకంగా కలిశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

చిత్తూరు, ఆగస్టు 24: మద్యం తాగి వాహనాలు నడిపిన 21 మందికి రూ.10వేలు చొప్పున రూ.2.10 లక్షల జరిమానా విధించారు. శుక్రవారం ట్రాఫిక్ సీఐ నిత్యబాబు పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 21 మందిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనరాదు

చిత్తూరు, ఆగస్టు 24: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార, అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయడం చట్ట విరుద్ధమని కమిషనర్ అరుణ తెలిపారు. ఒకవేళ కొనుగోలు చేస్తే మున్సిపల్ అప్రూవల్స్ ఇచ్చేది లేదని పేర్కొన్నారు. డ్రైనేజీ, నీటి వసతి కల్పించబోమని తెలిపారు.

రేపటి నుంచి గోకులాష్టమి వేడుకలు

వెదురుకుప్పం, ఆగస్టు 24: కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు గోకులాష్టమి ఉత్సవాలు జరుగుతాయని ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక హోమాలు, పూజలు ఉంటాయని, 30వ తేదీ సాయంత్రం వీధి ఉత్సవం ఉంటుందని వివరించారు.

పాఠశాలకు విరాళం



వెదురుకుప్పం, ఆగస్టు 24: కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు రిటైర్డ్ టీచరు సుబ్రహ్మణ్యం రూ.5వేలు విరాళంగా అందించారు. ఈ మేరకు నగదును శనివారం హెచ్ఎం కేశవులుకు అందజేశారు. సుబ్రహ్మణ్యంను సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పుష్కర కుంభాభిషేకం



వెదురుకుప్పం, ఆగస్టు 24: కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ ఆలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేకం శనివారం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధులకు అన్నదానం



వెదురుకుప్పం, ఆగస్టు 24: కార్వేటినగరం మండలం సీడీకండ్రిగకు చెందిన టీడీపీ నాయకులు దాసరి గణేష్, వనజ కుటుంబీకుల వితరణతో కార్వేటినగరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శనివారం అన్నదానం చేశారు. వృద్ధులకు చేయూతనివ్వాలని గణేష్ కోరారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, ఆగస్టు 24: దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కె.కార్తీక్ అయ్యంగార్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేశారు. ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లక్ష్మీ నరసింహస్వామికి విశేష పూజలు

వెదురుకుప్పం, ఆగస్టు 24: చిన్నమరెడ్డికండ్రిగలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామికి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తులసి దళములు, సుగంధభరితమైన పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ధర్మకర్త మిట్టపల్లి మంజుల, సుబ్రహ్మణ్యం దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచాయతీలకు నిధులు

పాలసముద్రం, ఆగస్టు 24: మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు రూ.29,11,262 నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. ఇందులో బాలకృష్ణాపురానికి రూ.2,39,502, ఆముదాల రూ.3,46,561, గంగమాంబాపురం రూ.1,49,079, క్రిష్ణజిమ్మాపురం రూ.2,48,005, కోదండరామాపురం రూ.29,729, నరసింహాపురం రూ.2,67,801, పాలసముద్రం రూ.5,26,404, సింహరాజుపురం రూ.1,47,720, శ్రీకావేరిరాజుపురం రూ.2,49,879, ఎస్.ఆర్.ఆర్‌కండ్రిగ రూ.97,804, తిరుమలరాజుపురం రూ.1,62,517, వనదుర్గాపురం రూ.1,59,447, వెంగళ్రాజుకుప్పానికి రూ.2,86,814 జమైనట్లు తెలిపారు.

వాహదారులకు జరిమానా

బంగారుపాళ్యం, ఆగస్టు 24: మద్యం తాగి వాహనాలు నడిపిన ఏడుగురికి రూ.10వేలు చొప్పున, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఇద్దరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు.

నగరి రూరల్ సీఐగా భాస్కర్

నింద్ర, ఆగస్టు 24: నగరి రూరల్ సీఐగా భాస్కర్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సత్యవేడు శ్రీసిటీలో పనిచేస్తున్న భాస్కర్ బదిలీపై నగరి రూరల్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకట్రామిరెడ్డి బదిలీపై వెళ్లారు. సీఐ భాస్కర్ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో తనవంతు కృషి చేస్తానని, ప్రజలు సహకరించాలని కోరారు.

భాస్కర్‌కు డాక్టరేట్



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 24: రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ స్కూల్ కరస్పాండెంట్ భాస్కర్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. విద్యారంగంతో పాటు సమాజంలోని పేదలకు ఆయన చేసిన సేవలకు గాను బెంగళూరులోని భారత్ వర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ వారు శనివారం డాక్టరేట్ అందజేశారు. పాఠశాల డైరెక్టర్ త్రివేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీగా వసంతవాణి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 24: జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీగా జె.వసంతవాణిని నియమిస్తూ డీఈవో దేవరాజు ఉత్తర్వులు జారీ చేశారు. యాదమరి మండలం కండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల (ఉర్దూ)లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఈమె రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

రోడ్డుకు మరమ్మతులు



పెనుమూరు, ఆగస్టు 24: పెనుమూరు నుంచి చిత్తూరుకు వెళ్లే మార్గంలో రేణుకానగర్ వద్ద కల్వర్టుపై ఉన్న రోడ్డుకు రంధ్రం పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో 'ప్రమాదాలు జరిగితే గాని స్పందించరా' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు శుక్రవారం రాత్రి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. వాహనాలు సాఫీగా వెళుతున్నాయి.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పెనుమూరు, ఆగస్టు 24: సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చిత్తూరు డివిజన్ ఏడీఏ ఉమా పేర్కొన్నారు. శనివారం చార్వాగానిపల్లిలో వేరుశెనగ పంటపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంటలకు విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగు మందులు వాడడం ద్వారా మనుషుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందన్నారు. వేరుశెనగ పంట బెట్టను తట్టుకోవడానికి యూరియా ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి సుహార్‌లత, రైతు శిక్షణ కేంద్రం ఏవోలు ప్రసన్న, హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సారా స్వాధీనం : ఇద్దరి అరెస్టు



గుడిపాల, ఆగస్టు 24: మండలంలో శనివారం నిర్వహించిన దాడుల్లో సారా స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. తిమ్మాపల్లి, గట్రాళ్లమిట్ట పరిసర ప్రాంతాల్లో సారా విక్రయిస్తున్న తిమ్మాపల్లికి చెందిన ఎడ్విన్, గట్రాళ్లమిట్టకు చెందిన బెంజిమెన్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి 236 ప్యాకెట్ల సారా స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ

గుడిపాల, ఆగస్టు 24: మండలంలోని సీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు శనివారం కేర్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో 'హెచ్ఐవీ / ఎయిడ్స్ అంటే మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సద్దాం, ఏఎన్ఎం రాజేశ్వరి, కల్పన పాల్గొన్నారు. నరహరిపేట హైస్కూల్‌లో చైల్డ్ లేబర్, చైల్డ్ మ్యారేజ్, మిస్సింగ్ చైల్డ్ అవేర్‌నెస్‌పై ర్యాలీ నిర్వహించారు.

ఎన్టీయే కార్యవర్గం ఎన్నిక



సూరిబాబు, నాగరాజ్

గుడిపాల, ఆగస్టు 24: ఎన్టీయే (నోబుల్ టీచర్స్ అసోసియేషన్) మండల కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు, గౌరవాధ్యక్షుడు వీరరాఘవులు నాయుడు, ఉపాధ్యక్షుడు జనార్దన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో గౌరవాధ్యక్షుడిగా పి.వి.రమణారెడ్డి, అధ్యక్షుడిగా సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా నాగరాజ్, కోశాధికారిగా శరవణ, సహాయ కార్యదర్శిగా లోకనాథం, కమిటీ సభ్యులుగా ప్రతాప్, లోకనాథం, శ్రీదేవి, శోభలను ఎన్నుకున్నారు.

తప్పు చేసినా చర్యలేవి?

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 24: టీచర్ల సర్దుబాటు ప్రక్రియలో కట్టమంచి పాఠశాల హెచ్ఎం తమ పాఠశాలలో రెండు పోస్టులను కాపాడుకునేందుకు అడ్డదారులను ఎంచుకున్నట్లు నిర్ధారణ జరిగినా చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. గాండ్లపల్లి మున్సిపల్ పాఠశాలలో డ్రాపౌట్ బాక్స్‌లోని 12 మంది విద్యార్థులు తమ పాఠశాలలో ఉన్నట్లు కట్టమంచి పాఠశాల హెచ్ఎం యూడైస్‌లోని చైల్డ్‌ఇన్ఫోలో నమోదు చేశారు. దీనిపై డీవైఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంఈవో 1, 2 శెల్వరాజ్, మోహన్‌లు ప్రాథమిక విచారణ చేపట్టారు. చైల్డ్ ఇన్ఫోలోని విద్యార్థులు స్కూల్‌లో ఫిజికల్‌గా లేరని దర్యాప్తులో తేలింది. హెచ్ఎంపై చర్యలకు సిఫారసు చేస్తూ డీవైఈవో మూడు రోజుల క్రితం డీఈవోకు నివేదిక సమర్పించినా చర్యలు తీసుకోకపోవడంపై విద్యాశాఖలో చర్చ జరుగుతోంది.

శిల్పకళా సౌరభం స్కంధ పుష్కరిణి

కార్వేటినగరం సంస్థానాదీశుల కళలకు ప్రతీక

వెదురుకుప్పం, ఆగస్టు 24 : కార్వేటినగరంలోని స్కంధ పుష్కరిణి వాస్తు, శిల్పకళలను ప్రతిబింబిస్తోంది. దక్షిణ భారతదేశంలోనే పెద్దదిగా పేరుగాంచిన ఈ పుష్కరిణి 14.5 ఎకరాల్లో కార్వేటినగరం సంస్థానాదీశుల కాలంలో నిర్మితమైంది. పుష్కరిణి మెట్లను చూడగానే ఆనాటి వాస్తు, శిల్ప కళలు కనువిందు చేస్తాయి. దేవతామూర్తుల శిల్పాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఏ వైపు నుంచి చూసినా పుష్కరిణిలో నీటి మట్టం సమానంగా కనిపించడం ఇక్కడి ప్రత్యేకత. ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో విలీనం చేసిన ఈ పుష్కరిణి ఎండిపోకుండా అప్పట్లోనే మధ్యలో బావులను తవ్వించారు.

కరువులో ప్రజల దాహార్తి తీర్చడానికే...

కార్వేటినగరం సంస్థానాదీశుడైన వెంకట పెరుమాళ్ మహారాజు ఈ స్కంధ పుష్కరిణిని 19వ శతాబ్ధంలో నిర్మించారు. అప్పట్లో ఏర్పడిన తీవ్ర కరువు పరిస్థితుల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి దీన్ని తవ్వించారని ప్రతీతి. కూలీలకు ధనాగారంలోని సంచుల నుంచి మహారాజు పిడికిలి నిండా ధనాన్ని తీసి ఇచ్చేవారని పూర్వీకులు చెబుతుంటారు.



ఏటా తెప్పోత్సవాలు జరిగేది ఇక్కడే

ఏటా రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, సుబ్రహ్మణ్యంస్వామి తెప్పోత్సవాలను ఈ పుష్కరిణిలోనే నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు చూడటానికి ఆంధ్ర నుంచే కాకుండా తమిళనాడు నుంచి భారీ సంఖ్యలో భక్తులు వస్తుంటారు.

పాఠశాల స్థలంలో అక్రమ కట్టడాలు ఆపండి



పంచాయతీ కార్యాలయంలో పెట్రోల్ బాటిల్‌తో రాజ్‌కుమార్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 24: : కాణిపాకం సమీపంలోని అగరంపల్లె జడ్పీ హైస్కూల్ స్థలంలో ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి చేపట్టిన అక్రమ కట్టడాలను ఆపకపోతే ఆత్మహత్య చేసుకుంటానని జనసేన మండల నాయకుడు రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం పెట్రోల్ బాటిల్‌తో కాణిపాకం పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. గ్రామస్తులు నచ్చజెప్పినా వినకుండా రెండు గంటల పాటు కార్యాలయంలోనే ఉండిపోయారు. పాఠశాలకు చెందిన సర్వే నెంబరు 362లో మోహన్‌రెడ్డి చేపట్టిన అక్రమ కట్టడంపై హైకోర్టు స్టే విధించినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, అడ్డుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సత్యంరెడ్డి అక్కడికి చేరుకుని రాజ్‌కుమార్‌తో మాట్లాడారు. అక్రమ కట్టడం పనులను నిలిపివేసి, గార్డులను సెక్యూరిటీగా పెట్టారు. అనంతరం రాజ్‌కుమార్ పంచాయతీ కార్యాలయం నుంచి బయటకు వచ్చారు.

అన్నదానానికి రూ.6 లక్షల విరాళం



బాబుకు పత్రం అందిస్తున్న ఈవో వాణి - చెక్కు అందిస్తున్న సునీల్‌కుమార్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 24: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానానికి శనివారం దాతలు రూ.6 లక్షలు విరాళంగా అందించారు. బెంగళూరుకు చెందిన పి.బాబు రూ.5లక్షలు, తిరుపతి జిల్లా దామలచెరువుకు చెందిన మండుటి సునీల్‌కుమార్ రూ.లక్ష ఇన్‌చార్జి ఈవో వాణికి అందజేశారు. దాతలకు స్వామి దర్శనం ఏర్పాటు చేశారు. వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డులు కీలకం



గౌరవ వందనం స్వీకరిస్తున్న మహేష్ కుమార్

చిత్తూరు, ఆగస్టు 24: శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డులు కీలకంగా వ్యవహరిస్తున్నారని కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. హోంగార్డు యూనిట్ల పరిశీలనలో భాగంగా శనివారం ఆయన చిత్తూరుకు వచ్చారు. ఆర్మ్‌డ్ రిజర్వు ఆఫీస్ వద్ద హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, దర్బార్ పరేడ్ నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, ఎంటీవో భాస్కర్, ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

గురు శిష్యరికంతోనే సద్గుణాలు



మాట్లాడుతున్న రఘుపతి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 24: సద్గుణాలతో జీవించాలంటే గురు శిష్యరికం అవసరమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త శ్రేయానంద సరస్వతి చిన్మయానంద తెలిపారు. ఏడు రోజులుగా సద్గురు ఆశ్రమంలో ఆమె గీతాజ్ఞాన ఉపన్యాసం చేశారు. భగవద్గీతలోని జ్ఞానయోగం, కేనోపనిషత్తు అధ్యాయాలను వివరించారు. శనివారం భగవద్గీతలోని శ్లోకాలను భక్తులతో పారాయణం చేయించి ముగించారు. ఆమెను ఆశ్రమ నిర్వాహకులు సత్కరించారు. ఆశ్రమ నిర్వాహకులు పరబ్రహ్మా స్వామి, కేశవులు, బాబునాయుడు, రఘుపతి పాల్గొన్నారు.

దాడి చేసి.. దుర్భాషలాడారని ఫిర్యాదు

వెదురుకుప్పం, ఆగస్టు 24: గంటావారిపల్లికి చెందిన కొందరు తమపై దాడిచేసి, దుర్భాషలాడారని అదే గ్రామానికి చెందిన బి.చందు వెదురుకుప్పం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. తన భర్త బి.దేవరాజులురెడ్డి ఆర్మీలో పనిచేస్తున్నారని, గతంలో ఆర్మీ కోటాలో ప్రభుత్వ భూమికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ విషయమై గ్రామానికి చెందిన కొందరు తమపై కక్ష పెంచుకున్నారని పేర్కొన్నారు. శనివారం భర్త, పిల్లలతో కలిసి కారులో గ్రామంలోని గంగమ్మ గుడికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు ఆపి తన భర్తను నోటికి వచ్చినట్లు దూషించారని తెలిపారు. ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించిన తననూ, భర్తను కారులో నుంచి బయటకు లాగి కొట్టారని తెలిపారు. నిందితులను శిక్షించాలని కోరారు.

స్థల వివాదంలో ప్రత్యర్థి ఇల్లు ధ్వంసం



పగిలిన కిటికీ అద్దాలు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 24: ఆరిమాకుపల్లె గ్రామానికి చెందిన ప్రసాద్‌బాబు(48)కు, అదే గ్రామానికి చెందిన పత్తి గుణశేఖర్ నాయుడుకు ఇంటి స్థలం విషయమై కొన్ని రోజులుగా వివాదం జరుగుతోంది. ప్రసాద్‌బాబు ఇంటి నిర్మాణం చేపట్టడంతో గుణశేఖర్ నాయుడు కిరాయి గుండాలతో వచ్చి గడ్డపార, రాడ్లతో ఇంటి తలుపులు, కిటికీల అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. అడ్డువచ్చిన ప్రసాద్‌బాబుపై దాడి చేశారు. సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రసాద్‌బాబు ఫిర్యాదు మేరకు గుణశేఖర్ నాయుడు, మరో 10మందిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

ఐసీడీఎస్ నూతన కమిటీ



విజయ, మమత, లక్ష్మీనరసమ్మ

వెదురుకుప్పం, ఆగస్టు 24: కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కె.విజయ, ప్రధాన కార్యదర్శిగా మమత, కోశాధికారిణిగా లక్ష్మీనరసన్న ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా భానుమతి, సుమలత, సహాయ కార్యదర్శులుగా రెడ్డెమ్మ, వనజాక్షితో పాటు మరో 15 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

హామీలను నెరవేర్చాలి..

అంగన్వాడీలకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గంగరాజు డిమాండ్ చేశారు. శనివారం కార్వేటినగరం వెలుగు కార్యాలయంలో వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం మండలాల అంగన్వాడీల సమావేశంలో ఆయన మాట్లాడారు.



గుడిపాల మండలం బట్టు వాల్లూరుకు చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ తుమ్మల సాంబశివనాయుడు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తదితరులు

మంగళవిద్యావాణి సంచిక ఆవిష్కరణ



బంగారుపాళ్యం, ఆగస్టు 24: మండలంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవిద్యావాణి 28వ సంచికను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి కుప్పాల మురళి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సంచికల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. సహాయ సహకారాలు అందించిన నలగాంపల్లికి చెందిన ఎన్‌పీ ధరణీప్రసాద్‌ను అభినందించారు. హెచ్ఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనులకు సహకరించండి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్

విజయపురం, ఆగస్టు 24: గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి, ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ కిరణ్ పేర్కొన్నారు. విజయపురం మిట్టూరులో సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో రెవెన్యూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ సూచించారు. జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్, మండల సర్వేయర్ శేఖర్, ఈవోపీఆర్డీ సురేంద్రకుమార్, నాయకులు జయరామరాజు, మురళి, చెంచయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

విజయపురం, ఆగస్టు 24: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాలని చిత్తూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగపద్మిని కోరారు. మండలంలోని కాళికాపురంలో శనివారం రైతులకు ప్రకృతి, వాతావరణ ఆధారిత వ్యవసాయం, భూసార పరీక్షలు, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. వరి, వేరుశెనగ, మిరప పంటల్లో తెగుళ్ల నివారణ, సస్యరక్షణ గురించి వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారిణి రజినీకుమారి పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధిపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రమౌళి

విజయపురం, ఆగస్టు 24: గ్రామీణాభివృద్ధిపై దృష్టి మళ్లించాలని ఎంపీడీవో చంద్రమౌళి అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాయలంలో శనివారం ఆయన సమస్యలపై సమీక్షించారు. ఎవరి పరిధిలో వారు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.

డాక్టరేట్ ప్రదానం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 24: చిత్తూరు నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్ కోలా కిరణ్‌కుమార్ సేవా కార్యక్రమాలకు మెచ్చి బెంగళూరులోని భారత్ వర్చువల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. శనివారం బెంగళూరులోని ఓ హోటల్లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్‌కు డాక్టరేట్ ఇచ్చారు.

ఏఐటీయూసీ సమ్మేళనాలను జయప్రదం చేయండి

చిత్తూరు రూరల్, ఆగస్టు 24: విశాఖపట్నంలో సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నేత నాగరాజు కోరారు. శనివారం సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

గ్రామాల్లో సీసీ రోడ్లకు శ్రీకారం



గుడిపాల, ఆగస్టు 24: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లకు శ్రీకారం చుట్టినట్లు జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. రూ.6.40 కోట్ల నిధులు ఉపాధి హామీ కింద మంజూరయ్యాయని వెల్లడించారు. శనివారం రామభద్రాపురం పంచాయతీ బుచ్చెన్నకండ్రిగ గ్రామంలో సీసీ రోడ్లు ప్రారంభించామన్నారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమాద్రి నాయుడు పాల్గొన్నారు.